క్లుప్తంగా

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని జంకు తండ గ్రామపంచాయతీ పరిధిలోని ఇండస్ట్రీయల్ ఏరియాతో పాటు జంగాలకాలనీలో నెల కొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు శుక్రవారం విద్యుత్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లపై నుంచి వెళ్లే కరెంట్ వైర్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని, కాలనీలో 11కెవి ట్రాన్స్‌ఫార్మర్ ను ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సత్యప్రసాద్, మండల నాయకులు ఎం. విజయ్‌నాయక్, నరేశ్‌నాయక్, సుబ్రహ్మణ్యం, రాముసాయక్, అంజిరెడ్డి, కిషన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలను తొలగించాలి

చింతపల్లి : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఇళ్లపై ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లను తొలగించాలని కోరుతూ శుక్రవారం ఆ కాలనీవాసులు విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎక్స్ రోడ్డు సమీపంలోని బీసీ కాలనీ వద్ద 11కేవీ వైర్లు ఇళ్లపై ఉండడంతో ఎప్పుడు ప్రమాదం పొంచి ఉందో తెలియక భయాందోళనకు గురవుతున్నామన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి ఇళ్లపై ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలను తొలగించాలని ఆ కాలనీవాసులు కోరుతున్నారు.

టీపీసీసీ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలి

మిర్యాలగూడ టౌన్ : టీపీసీసీ అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సారి బీసీలకు నామినేటెడ్ పోస్టులతో పాటు టీపీసీసీ పదవిని బీసీలకు ఇవ్వకుంటే పార్టీ పతనం తప్పదన్నారు. బీసీ గణనను చేపట్టిన తరువాతనే గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో రిజర్వేషన్లు ప్రకటించాలన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



మృత్యువాతపడిన గేదె

మాడుగులపల్లి : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని ఇందుగుల గ్రామంలో శుక్రవారం జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన మజ్జిగపు వెంకట్ రెడ్డి గేదెలను మేతకోసం వదిలాడు. ముత్యాలమ్మ గుడి వద్ద రోడ్డు వెంట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురై ఓ గేదె మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టు కంచె లేదని, ఇన్సులేటర్లు పగిలిన కారణంగా ఎర్త్ వచ్చి గేదె చనిపోయిందని బాధిత రైతు ఆరోపించారు. రూ. 90 వేలు నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని, న్యాయం చేయాలని కోరారు.

నర్రా ప్రవీణ్‌రెడ్డికి డాక్టరేట్



ప్రవీణ్‌రెడ్డిని అభినందిస్తున్న కూరెళ్ల

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన ప్రముఖ కవి, రచయిత నర్రా ప్రవీణ్‌రెడ్డికి ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు సాహిత్యం విభాగంలో శుక్రవారం డాక్టరేట్‌ను ప్రకటించింది. ప్రవీణ్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రఘు పర్యవేక్షణలో 'డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి సాహిత్యం-సమగ్ర అధ్యయనం' అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ అందుకోనున్నారు. ఈ సందర్భంగా నర్రా ప్రవీణ్‌రెడ్డిని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య శుక్రవారం అభినందించి సత్కరించారు. అదే విధంగా ప్రముఖ కవులు, రచయితలు ఎం.వి.గోనారెడ్డి, వేణు సంకోజు, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ బెల్లి యాదయ్య, డాక్టర్ చింతల రాకేష్ భవాని, నర్సింహ, అంజయ్యలు ప్రత్యేకంగా అభినందించారు.

నల్లబెల్లం పట్టివేత

కొండమల్లేపల్లి : అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటికను దేవరకొండ ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. దేవరకొండ ఎక్సైజ్‌సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలపరిధిలోని శేరిపల్లి గేట్ సమీపంలో సమాచారం మేరకు రూట్ వాచ్ నిర్వహిస్తుండగా దేవరకొండ వైపు వెళ్తున్న టాటా ఇంట్రా వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో 1350కేజీల నల్లబెల్లం, 200పట్టికను స్వాధీనం చేసుకొని, ఒకరిపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు నరసింహ, వీరబాబు, కానిస్టేబుల్ కృష్ణ ఉన్నారు.

కబ్జాలో గంధంవారి కుంట



జేసీబీతో చెరువు కట్టను తవ్విస్తున్న రైతు



చదును చేసిన చెరువు శిఖం భూమి

- పొలంగా మార్చుకున్న ఆక్రమణదారుడు
- కుంటను కాపాడాలని గ్రామస్తుల వేడుకోలు

మిర్యాలగూడ : అనావృష్టితో చెరువులు మొత్తం ఎండిపోవడంతో ఆక్రమణదారులకు అవకాశంగా మారింది. దీంతో చెరువులు, కుంటలు అన్యాక్రాంతానికి గురవుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామశివారులోగల గంధంవారికుంట 13.26ఎకరాలు ఉండగా కుంట పూర్తిగా ఎండిపోవడంతో చెరువు పక్కన ఉన్న రైతు ఏకంగా జేసీబీతో చెరువు కట్టను తొలగించి పూర్తిగా పొలంలా మార్చేస్తున్నాడు. గ్రామస్తులు కొందరు ఆక్రమణపై నిలదీస్తే ×దిక్కున్న చోట చెప్పుకోండి ఎవరేమి చేయలేరంటూ॰ సమాధానం ఇస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. కుంటలో నీళ్ల ఉంటే పశువులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని, అలాంటి కుంటను కబ్జా చేస్తే రానున్న కాలంలో మరింత గడ్డు పరిస్థితి దాపురించనుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికే భూగర్భ జలాలు ఇంకిపోయి బోర్లలో సైతం నీరు రాక పంట పొలాలు ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కబ్జాకు గురైన గంధంవారికుంటకు హద్దులు నిర్ణయించి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

చెరువును కాపాడాలి



గంధంవారికుంట ఆక్రమణకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. చెరువు కట్టను సైతం తొలగించి చదును చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నిద్రావస్థలో ఉన్న అధికారులు మేల్కొని కుంటను కాపాడాలి.

– ఇస్లావత్ సైదానాయక్ , తుంగపాడు

ఆక్రమిస్తే కఠిన చర్యలు

చెరువులు కాని, కుంటలను కాని ఎఫ్‌టీఎల్ లెవల్‌కు లోపల ఎవరూ అతిక్రమించి సాగుచేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. గంధంవారికుంట చెరువు ఆక్రమణపై వెంటనే చర్యలు తీసుకోని హద్దులను ఏర్పాటు చేస్తాం.

– హరిబాబు, తహసీల్దార్

మొబైల్ సిస్టమ్ హాజరును రద్దు చేయాలి



మాట్లాడుతున్న కంబాలపల్లి ఆనంద్

కొండమల్లేపల్లి : నేషనల్ మానిటరింగ్ మొబైల్ సిస్టమ్ ద్వారా కూలీల హాజరు కోసం తెచ్చిన సర్క్యులర్ నంబర్ 333ను రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ డిమాండ్ చేశారు. శుక్రవారం కొండమల్లేపల్లిలోని కొల్‌ముంతలపహాడ్ గ్రామంలో ఉపాధి హామీ కూలీల పని ప్రదేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పనులకు నిధులు కుదిస్తూ ఆన్‌లైన్ ఫొటోస్ అప్లోడ్ పేరుతో పనికి దూరం చేస్తుందని ఆరోపించారు. సెల్ ఫోన్‌సిగ్నల్ లేని సందర్భాల్లో కూలీలకు వేతనాలు నిలిచిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజు కూలీ రూ.600, 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్, కూలీలు వస్కుల యాదయ్య, యాదమ్మ, శాంతిబాయి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించండి

మిర్యాలగూడ టౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏలే భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు కోరారు. శుక్రవారం స్థానిక బృందావన్ గార్డెన్‌లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రాడ్యుయేషన్ ఓటర్లను ప్రతి ఒక్కరిని కలుసుకొని మొదటి ప్రాధాన్యత ఓటును బీజేపీ అభ్యర్థికి వేయించేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ నాగిరెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, చిలుకూరి శ్యాం, బంటు గిరి, జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ ప్రభారీ లచ్చిరెడ్డి, సరిత శేఖర్, వేణు, రవిబాబు, శివ, రమణ, సాంబమూర్తి, విద్యాసాగర్, లచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కె.పర్వతాలు

నల్లగొండ టౌన్ : సామాజిక న్యాయ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎస్‌బీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే సబ్బండ కులాల సమ్మేళనంలో సబ్బండ కులాల నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని జేఏసీ నాయకుడు కె.పర్వతాలు పిలుపునిచ్చారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో అత్యధికంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అన్ని రాజకీయ పార్టీలు విస్మరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం ఎజెండాగా జేఏసీ పనిచేస్తుందన్నారు. ఈ సమ్మేళనానికి న్యాయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, మేధావులు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో ఎండీ నజీరుద్దీన్, దుడుకు లక్ష్మీనారాయణ, నేలపట్ల సత్యనారాయణ, వంటిపాక యాదగిరి, మామిడి ప్రమీల, చాంద్‌పాష, వంగూరు సత్యనారాయణయాదవ్, పగిళ్ల కృష్ణ, బొజ్జ దుర్గయ్య, వల్లకీర్తి శ్రీనివాస్, షకీల్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మిర్యాలగూడ : దామరచర్లలోని తెలంగాణ గిరిజ సంక్షేమ పాఠశాల, కళాశాలలో 2024– 25 విద్యా సంవత్సరంలో జూనియర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరే విద్యార్థులు ఈనెల 25లోపు మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. 2024 మార్చిలో పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు జీపీఏ ప్రాతపదికన అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో పాటు రెండు సెట్ల జీరాక్స్ కాపీలతో హాజరుకావాలని తెలిపారు .

డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



మత్స్య శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : మత్స్య కార్మికుల నుంచి సభ్యత్వాల పేరుతో డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు ఎం.సీతయ్య కోరారు. ఈమేరకు శుక్రవారం సూర్యాపేటలోని మత్స్య శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సభ్యత్వానికి డబ్బులు కట్టిన వారు మృత్యువాత పడ్డా వారికి ఇన్సూరెన్స్ వర్తించడం లేదని అన్నారు. కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేసి మత్స్యశాఖకు చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట నాయకులు ఎం.రాంగోపి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

అనుమతి లేకుండా బోర్డులు ఏర్పాటు చేయొద్దు



అంబరిల్లాను తొలగిస్తున్న జేసీబీ

నల్లగొండ టూటౌన్: మున్సిపల్ కార్యాలయం నుంచి అనుమతి తీసుకోకుండా అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అన్నారు. నీలగిరి పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో అనుమతి లేకుండా ప్రధాన రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన అంబరిల్లాలను శుక్రవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా కమిషర్ మాట్లాడుతూ పది అంబరిల్లాలను తొలగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గడ్డం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి శ్రీ భాగవత సప్తాహం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అర్చకులు

రామగిరి(నల్లగొండ): ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు పట్టణంలోని రామగిరి ఇండియన్ గ్యాస్ కార్యాలయం సమీపంలో అక్కినేపల్లి లక్ష్మణరావు శ్రీదేవి నివాసంలో శ్రీ భాగవత సప్తాహం జరగనుంది. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం అర్చకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24వ తేదీన జరిగే ఇరామానుశ నుర్తాదాది పారాయణంకు అష్టాక్షరి సంపత్ కుమార జీయర్‌స్వామి, 26 తేదీన లక్ష మల్లెపుష్పార్చనకు శ్రీ అహోబిల రామానుజ జీయర్ స్వామి, 29వ తేదీన ధన్వంతరి యాగానికి శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీమాన్ నల్లాని చక్రవర్తుల రామకృష్ణచార్యులు, రామరంగాచార్యులు, అక్కినేపల్లి లక్ష్మణ్‌రావు శ్రీదేవి, సత్యనారాయణ, అరుణ, పద్మావతి, విజయలక్ష్మి, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



పెద్దవూర : ఆర్థిక సాయం అందజేస్తున్న పాల సంఘం చైర్మన్ బక్కయ్య



దేవరకొండ : ఆర్థికసాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు

పెద్దవూర : మండలంలోని పోతునూరు గ్రామానికి చెందిన పెండ్యాల నర్సింహారావు ఇటీవల మృతి చెందాడు. మదర్ డెయిరీలో సభ్యుడిగా ఉండటంతో శుక్రవారం పాల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సాయం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోతునూరు మదర్ డైరీ చైర్మన్ రేపాకుల బక్కయ్య, హాలియా సొసైటీ మేనేజర్ సత్యం, సూపర్‌వైజర్ బాలయ్య, డైరెక్టర్‌లు ఎరుకుల గోపయ్య, ఎలిజాల వెంకటయ్య, ముత్యాల నాగరాజు, సత్తయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ : పట్టణానికి చెందిన ఏశాల శ్రీనివాసులు మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన చికిత్స కోసం ఇప్పటి వరకు దాదాపు రూ.15లక్షల మేర ఖర్చు చేశారు. ఈ విషయం తెలుసుకున్న దేవరకొండకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు బాధితుడికి శుక్రవారం రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్వేష్‌రెడ్డి, కేస నరేష్, అంజి, రమేష్, శివ పాల్గొన్నారు.

జోరుగా పత్తి విత్తనాల కొనుగోళ్లు



విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

మునుగోడు: వానాకాలం పంట సీజన్ ప్రారంభం కావడంతోపాటు గురువారం రాత్రి వర్షం కురవడంతో రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. పత్తి పంట సాగు చేసే రైతులు దుక్కులు దున్నుకోవడంతోపాటు పంట సాగుకు అవసరమైన విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. మరోమారు వర్షం కురిస్తే విత్తనాలు నాటేందుకు సిద్ధమవుతున్నారు.

బూరుగడ్డ ఆలయంలో పంచామృతాభిషేకం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి దేవాలయంలో శుక్రవారం సహస్రనామ కుంకుమార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, బాలభోగం, సేవాకాలం, స్వామివార్లకు పంచామృతాభిషేకం, మంగళశాసనం, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం భక్తులు గోమాతకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మణరావు, అర్చకులు ముదుంబై శ్రీనివాసాచార్యులు, హరీష్‌కుమార్ చార్యులు, మనోహరాచార్యులు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు యరగాని భిక్షం, యరగాని నర్సింహారావు, గురవయ్య, వీరబాబు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



గోమాతకు పూజ చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని కృష్ణా కాలనీలో గల కేవీఆర్ ఐఐటీ అకాడమీలో వివిధ పాఠశాలలకు చెందిన వంది మంది విద్యార్థులకు కేవీఆర్ అకాడమీ కరస్పాండెంట్ కాతోజు వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఐఐటీ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులు లాస్యశ్రీ, సాత్విక్, హర్షవర్ధన్, హన్మంతు, వైష్ణవి, అఖిల్, రోహన్, శారు, పవన్, కుందనలకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ శిక్షణ ఇస్తున్న కేవీఆర్ అకాడమీ యాజమాన్యాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి, నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, చిట్టిబాబునాయక్, ఇరుగు మధు, జానకిరాంరెడ్డి పాటు అకాడమీ యాజమాన్యం, సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

మిర్యాలగూడ : గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ మండలంలోని జంకుతండాలో ఆయన తాగునీటి బోరును ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకుగాను అన్ని చర్యలు తీసుకుంటామని అందులో భాగంగానే గ్రామంలో తాగునీటి బోరును ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్య పరిష్కారానికి కృషి

మిర్యాలగూడ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపిస్తే నిరుద్యోగ, ఉద్యోగుల సమస్యలనపరిష్కారానికి కృషి చేస్తారని మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావుతో కలిసి మాట్లాడారు. ఈనెల 21న పట్టణంలోని టీఎస్ఆర్ గార్డెన్‌లో 2వేల మంది పట్టభద్రులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, ఈ సమావేశానికి అభ్యర్థి రాకేష్‌రెడ్డితోపాటు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి పట్టభద్రులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మోసిన్‌అలీ, జొన్నలగడ్డ రంగారెడ్డి, నారాయణరెడ్డి, బాబయ్య, కరుణాకర్ రెడ్డి, మల్లేష్‌గౌడ్, ఫయాజ్, రవీందర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి నూతన స్విఫ్ట్ కారు



నూతన స్విఫ్ట్ కారును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : పట్టణంలోని పవన్ మోటార్స్ షోరూమ్‌లో మారుతి కంపెనీ నూతన స్విఫ్ట్ కారును శుక్రవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మారుతి సుజుకి, పవన్ మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర పవన్‌రెడ్డి, పవన్ మోటార్స్ బి జినెస్ హెడ్ రవిరెడ్డి, ఏజీఎం సీతారాంరెడ్డి, టీడీఎం సుధాకర్, ఏఎస్ఎం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధన మహోత్సవం



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని మల్లెల గట్టుపై ఉన్న గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మల జెండా ఆవిష్కరణ అనంతరం స్వామివారికి సుప్రభాత సేవల, గణపతి పూజ, పుణ్యావాచనం, మూల మంత్రయజ్ఞం, పూర్ణాహుతి మహోత్సవం, స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కర్నెకంటి జంగాచారి, నరేంద్రచారి, అచ్యుతచారి, భాస్కర్ చారి, వీరాచారి, కోటాచారి, నాగభూషణచారి, వెంకటాచారి, బుచ్చాచారి, శివచారి, నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై విచారణ

చందంపేట : మండలంలోని బుడ్డోనితండాలోని రేషన్ డీలర్ పీడీఎస్ బియ్యాన్ని సరఫరా చేయడం లేదని, సక్రమంగా రేషన్ దుకాణం నిర్వహించడం లేదని ఆరోపిస్తూ గ్రామ యువకులు పలువురు దేవరకొండ ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్ బుడ్డోనితండాలో విచారణ జరిపారు. సదరు రేషన్ డీలర్ కీ రిజిస్టర్ నిర్వహించడం లేదని, మ్యాన్‌వల్‌గా సరుకులు ఇస్తుండడంతో అక్రమాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు డీటీసీఎస్ తెలిపారు.



విచారణ చేస్తున్న డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్

ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సన్నద్ధం

- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు
- దేవరకొండ డివిజన్‌లో 14 పోలింగ్ కేంద్రాల గుర్తింపు

దేవరకొండ : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఇప్పటికే సన్నద్ధమయ్యారు. ఇందుకు గాను జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈనెల 27న జరుగనున్న వరంగల్–ఖమ్మం–నల్లగొండ గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌కు దేవరకొండ డివిజన్ పరిధిలో సర్వం సిద్ధం చేశారు. డివిజన్ పరిధిలో మొత్తం 14పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడ అవసరమైన చర్యలు చేపట్టినట్లు దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్లు తమ ఓటును వినియోగించుకునేందుకు సర్వం సిద్ధం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 27న ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది.

డివిజన్‌లో ఇలా..

దేవరకొండ డివిజన్ పరిధిలో ఆయా మండలాల్లో మొత్తం 11వేల 626మంది ఓటర్లు ఉండగా వీరిలో 8వేల63మంది పురుషులు,3వేల 563మంది మహిళలు ఉన్నారు. ఇందుకు గాను మొత్తం 14పోలింగ్ కేంద్రాలు అధికారులు సిద్ధం చేశారు. దేవరకొండ పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలలో 2, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 2, గుర్రంపోడు మండలం జెడ్పీహెచ్ఎస్‌లో 2,చింతపల్లి మోడల్ స్కూల్‌లో 2,చందంపేట ఎంపీపీఎస్‌లో1,గుండ్లపల్లి మోడల్ స్కూల్‌లో 1కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 1,నేరేడుగొమ్ము మండలం మోడల్ స్కూల్‌లో 1,పీఏపల్లి మండలం జెడ్పీహెచ్ఎస్‌లో 1,గుడిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 1 చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.



దేవరకొండ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పిస్తున్నాం

ఈనెల 27న జరుగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ నేపథ్యంలో దేవరకొండ డివిజన్ పరిధిలో మొత్తం 14 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశాం. మొత్తం 11వేల 586మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకు తగ్గట్లుగా ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సన్నద్ధం అవుతున్నాం.



– శ్రీరాములు, ఆర్డీఓ, దేవరకొండ